క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల మీట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిమ్మనపల్లె ఎంఈఓగా పద్మావతి



నిమ్మనపల్లె: నిమ్మనపల్లె ఎంఈఓ–1గా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం పానగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పద్మావతి నియమితులయ్యారు. ఆదివారం కడపలో జరిగిన జోన్‌-4 ఎంఈఓల బదిలీల కౌన్సెలింగ్‌లో నిమ్మనపల్లె ఎంఈఓ–1గా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె గతంలో మదనపల్లె బాలికోన్నత ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేశారు. త్వరలోనే బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు.

95 శాతం పెన్షన్లు పంపిణీ

పీలేరు రూరల్: మండలంలో 95 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 9,464 మందికి రూ.2.57,27,250 పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండురోజుల్లో పెన్షన్లు వందశాతం పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తి తెలిపారు. ఉదయం అభిషేకాలు, హోమాలు చేస్తామన్నారు. భక్తులు స్వయంగా స్వామికి పాలాభిషేకం చేయవచ్చునన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మల్లయ్యకొండపై శివకోటి నామస్మరణ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శివకోటి నామస్మరణ కార్యక్రమం జరుగుతుందని కళాకారులు గంధర్వరెడ్డి తెలిపారు. ముద్దలదొడ్డి శ్రీనేలమల్లేశ్వరస్వామి బజనమండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా గోపూజ కార్యక్రమంతో శివకోటి నామస్మరణ నిర్వహిస్తారన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం శాంతి పూజలు

గుర్రంకొండ: రాయచోటి- అంగళ్లు ఎన్‌హెచ్ 340 మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె గ్రామస్తులు హైవే రోడ్డుపై ప్రత్యేక శాంతి పూజలు నిర్వహించారు. జాతీయ రహదారిపై గుర్రంకొండ నుంచి చెర్లోపల్లె మీదుగా మొటుకు క్రాస్ వరకు ఇటీవల నెలరోజులుగా 12 రోడ్డు ప్రమాదాలు జరిగి ఎనిమిది మంది మృతి చెందారు. ఈనేపథ్యంలో జాతీయరహదారికి శాంతి పూజలు నిర్వహించాలని భావించిన దద్దాలవారిపల్లె ప్రజలు ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్డుపై బలిఅన్నం ఉంచి, బోనాలతో ఘనంగా పూజలు చేశారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ బదిలీ



జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర రావు

కలికిరి: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణను జేఎన్‌టీయూ అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కళాశాలలో ఈఈఈ విభాగం హెచ్‌ఓడీగా ఉన్న ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావుకు ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ ఎం.నసీరాకు వైస్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. అనంతపురం జేఎన్‌టీయూలో ఈఈఈ విభాగాధిపతిగా ఉన్న ప్రొఫెసర్ ఎన్.విశాలి, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డీ.ఆర్.శ్రీనివాసన్, అడిషిల్ కంట్రోలర్ ఎస్.శ్రీధర్ లను కలికిరి జేఎన్‌టీయూ కళాశాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ కె.అపర్ణ ఈసీఈ విభాగాధిపతిగానూ, అనంతరం జేఎన్‌టీయూ అడిషినల్ కంట్రోలర్ డాక్టర్ జితేంద్ర గౌడ్ కలికిరి కళాశాల ఈఈఈ విభాగాధిపతిగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

పీలేరురూరల్ : పీలేరు పట్టణానికి చెందిన వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ గడిబాషా మనుమరాలు వివాహం ఆదివారం స్థానిక ×ఎస్ౡ కన్వెన్షన్ హాల్ జరిగింది. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి, ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రత్యేక చొరవ..
ప్రతి ఇంటికి శుద్ధ జలం

- పీలేరు మండలంలోనే 40 ఆర్‌వో ప్లాంట్లు
- ఇంకా అవసరమున్న ప్రాంతాలకు ప్రతిపాదనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పీలేరు పట్టణంలో ఉచితంగా శుద్ధజలం పట్టుకుంటున్న ప్రజలు

పీలేరు : ప్రజలు శుద్ధ జలం తాగాలంటే క్యాన్‌కు రూ. 15 నుంచి రూ. 20 వరకు వెచ్చించాల్సి వచ్చేది. ఇలా తాగునీటికే నెలకు ఒక్కో కుటుంబం రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ప్రజల ఇబ్బందులను, కష్టాలను తెలుసుకున్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో ఎక్కడాలేని విధంగా పీలేరు మండలంలో ప్రజలకు శుద్ధ జలం ఇచ్చే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఎంపీ ప్రత్యేక చొరవతో మండలంలో ఇప్పటికే 40 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా శుద్ధ జలం అందిస్తున్నారు. జెడ్పీ నిధులు, మండల నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో ఒక్కో ఆర్‌వో ప్లాంటుకు రూ. 4.50 లక్షలు వెచ్చించారు. ఒక్క పీలేరు పట్టణంలోనే 26 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీరందిస్తున్నారు. మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో పంచాయతీకి ఒక్కో ఆర్‌ఓ ప్లాంటు చొప్పున ఏర్పాటు చేశారు. ఎంపీ చొరవతో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా 3 ఆర్‌వో ప్లాంట్లకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. ఇంకా అవసరమున్న గ్రామాల్లో ఏర్పాటు చేయడానికి ప్రజల కోరిక మేరకు ప్రతి పాదనలు చేస్తామని చెప్పారు.

తాగునీటి ఖర్చు తగ్గింది



గతంలో మంచినీరు కావాలంటే డబ్బులు వెచ్చించి క్యాన్లు కొనుగోలు చేసేవాళ్లం. నెలకు రూ. 600కుపై ఖర్చు అయ్యేది. అయితే ఎంపీ కృషితో మా ఇంటికి సమీపంలో ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయడంతో శుద్ధ జలం ఉచితంగా తెచ్చుకుంటున్నాం. మాకే కాకుండా ఈ ప్రాంతంలోని ప్రజలందరూ ఉచితంగా నీరు పట్టుకుంటున్నారు.

-అనురాధ, చెన్నారెడ్డి వీధి, పీలేరు

ఉచిత తాగునీరు వరం



ఉచితంగా ఆర్‌వో తాగునీరు అందించడం మాలాంటి వారికి వరం లాంటిది. గతంలో ఆర్‌వో వాటర్ కావాలంటే వేరే ప్రాంతానికి క్యాన్ తీసుకెళ్లి డబ్బులిచ్చి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. అయితే ఎంపీ పుణ్యమా అని మా ప్రాంతంలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయడంతోపాటు ఉచితంగా నీరందిస్తుండడంతో మా బాధలు తొలగిపోయాయి.

- దేవిక, పీలేరు

ఉచితంగా శుద్ధ జలం



ప్రతి కుటుంబానికి శుద్ధ జలం ఇవ్వడమే లక్ష్యంగా మండలంలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. పీలేరు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉచితంగా ఆర్‌వో ప్లాంట్లు ద్వారా తాగునీరు అందించడం జరుగుతోంది. అలాగే ప్రతి పంచాయతీలోనూ ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశాం. అన్ని మండలాల్లో ఆర్‌వో ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపీ సహకారంతో కృషి చేస్తాం.- చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే

వైద్యవృత్తికి వన్నె తేవాలి

–మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి



బదిలీ వైద్యులను సన్మానిస్తున్న జిల్లా ఆస్పత్రి సిబ్బంది

మదనపల్లె: ఎక్కడ పనిచేసినా వైద్యులు తమ వృత్తికి వన్నె తేవాలని మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ ప్రసాద్‌రాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఇటీవల బదిలీ అయిన వైద్యులు, సిబ్బందికి వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమన్నారు. తాము పని చేసిన ఆస్పత్రుల్లో, తమ చికిత్సల ద్వారా అనారోగ్యం నుంచి బయటపడిన రోగుల మాటలు ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. వైద్యవృత్తిలో వస్తున్న నూతన ఒరవడి, ఆధునిక సాంకేతికతను వైద్యులు అందిపుచ్చుకోవాలన్నారు. పని చేసే ప్రాంతాల్లో ప్రజల వద్ద నుంచి తమ సేవల ద్వారా మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో సదాభిప్రాయం కలిగించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించి ప్రాణదాతలనే మాటను నిలపాలన్నారు. బదిలీ అయిన సీనియర్ వైద్యులు రామమూర్తినాయక్, ఆంజనేయులు, అనురాధ, అస్మాకన్వాల్,చైతన్యజ్యోతి, స్టాఫ్ నర్సులు వనజ, అరుణకుమారి, విజయలక్ష్మి, కుమారి,రుక్మిణి, ఉమామహేశ్వరి, సిబ్బంది సందీప్‌కిషోర్, ప్రేమ్‌కుమార్, విజయకృష్ణయాదవ్, పార్థసారథి, స్వామినాథన్, మురగయ్యలకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. వైద్యులు పాల్ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



పీలేరు: తిరువణ్ణామలై బస్సులను ప్రారంభిస్తున్న డీఎం కుమార్

పీలేరు రూరల్ : అరుణాచలం (తిరువణ్ణామలై) గిరి ప్రదక్షిణకు 8 ప్రత్యేక బస్సు సర్వీసులు వెళ్లినట్లు డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నుంచి 4, కేవీపల్లె నుంచి 2, సదుం నుంచి 2 సర్వీసులు పంపినట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమికి పీలేరు నుంచి తిరువణ్ణామలైకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీఐ బాబునాయక్, మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ, ప్రమీల, ఎన్ఎంయూ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె నుంచి..

మదనపల్లె సిటీ: గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం స్థానిక వన్,టు డిపోల నుంచి అరుణాచలానికు ప్రత్యేక బస్సులు నడిపారు. టు డిపో నుంచి 11 బస్సులు పంపినట్లు డీఎం ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. వన్ డిపో నుంచి రెండు అల్ట్రాడీలక్స్, నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు పంపినట్లు వన్ డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు.

వ్యాపారవేత్తలుగా రాణించాలి

తంబళ్లపల్లె: అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు చదువుకున్న యువత వ్యవసాయ వ్యాపార వేత్తలుగా రాణించాలని శ్యామలక్రిష్ణ అగ్రికల్చర్, పాల్‌టెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ క్రిష్ణారెడ్డి తెలిపారు. లక్కసముద్రం వద్ద ఉన్న శ్యామలక్రిష్ణ అగ్రికల్చర్,పాలటెక్నిక్ కళాశాలలో ఏసీఏబీసీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీఏబీసీ(అగ్రిక్లీనిక్ అగ్రిబిజినెస్ సెంటర్)పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ డిప్లమా కోర్సులు పూర్తి చేసిన యువతీ, యువకులకు ఏసీఏబీసీ శిక్షణ ఇస్తామన్నారు. అధ్యాపకురాలు శ్రీనిధి, సాయిల్ సైంటిస్టు శ్రీనాథరెడ్డిలు సమస్యల పరిష్కారం , సవాళ్లను ఎదుర్కొనే తీరు, కొనుగోలు దారుడి సంతృప్తి వంటి అంశాలపై 45 రోజులపాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. అగ్రికల్చర డిప్లమా కోర్సులు పూర్తి చేసిన గ్రామీణప్రాంత యువతి, యువకులు శిక్షణకు హాజరై వ్యవసాయ వ్యాపారవేతలుగా రాణించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మదనపల్లె సిటీ: గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక అమ్మచెరువుమిట్టలోని శ్రీ కృష్ణమందిరం భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. అన్నమయ్య సర్కిల్, అమ్మచెరువుమిట్ట, చౌడేశ్వరి సర్కిల్ నుంచి కృష్ణమందిరం వరకు గిరి ప్రదక్షిణ చేశారు. కృష్ణనామాలతో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విరూపాక్షేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివలింగానికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం,దత్తాత్రేయ, సత్యనారాయణ స్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు మహా మంగళహారతి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అదజేసి భోజన సౌకర్యం కల్పించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి



ఉర్దూ గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు కరీముల్లా

గుర్రంకొండ: ఉర్దూ భాషాభివృద్ధికి గ్రంథాలయా సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. ఆదివారం స్థానిక ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ కరీముల్లాతో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అకాడమీ 36 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను, మరో 36 గ్రంథాలయాలను నిర్వహిస్తోందన్నారు. ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమి సేవలందిస్తోందన్నారు. ఇటీవల రాష్ట్ర స్కిల్ డెవల్మెపమెంట్ కార్పోరేషన్ తో ఎంఓయూ చేసుకొని వృత్తి నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉర్దూ అకాడమి ద్వారా ఉర్దూ పత్రికలను తీసకొచ్చి ఉర్దూ పాఠశాలలకు, గ్రంథాలయాలకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుసుమ కుమారి, సిబ్బంది చంద్రశేఖర్‌నాయుడు, షౌకత్ హుస్సేన్ పాల్గొన్నారు.

మెరుగైన పౌష్టికాహారం అందించండి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



అంగన్‌వాడీ సహాయకులకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వాల్మీకిపురం, కలికిరి మండలాల అంగన్‌వాడీ సహాయకులుగా ఎంపికైన మహిళలకు ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని విధులను బాధ్యతతో నిర్వర్తించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలకు వచ్చే నిరుపేద చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుందని, విధుల్లో చేరిన మహిళలు పారదర్శకంగా చిన్నారులకు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఆర్బీకే చైర్మన్ నీళ్లభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణ కోసం సంతకాల సేకరణ



వాల్మీకులతో కలిసి మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

మదనపల్లె: ఎస్టీ పునరుద్దరణ కోసం లక్ష సంతకాలు సేకరించనున్నట్లు వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని నక్కలదిన్నె ప్రాంతంలో వాల్మీకుల కుటుంబసభ్యులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయన్నారు. వాల్మీకులు స్థితిగతులు తెలిసేలా లక్ష సంతకాలు సేకరించి రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్షపార్టీల నాయకులకు పంపి, వాల్మీకుల ఎస్టీ ఆకాంక్ష తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు సద్దల జయసింహా, మంజునాథ, గాది భాస్కర్, గంగాధర్, నరసింహులు,నారాయణ, శ్రీనివాసులు, చంద్రన్న, మనోహర, రాము తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి



విద్యార్థులతో దాతలు, వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు జీవీ ప్రసాద్

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యులు, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు జీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ గొల్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో 2009లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు దాతల సహకారంతో విద్యాసామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు లీలా మాధురి, రాజేష్‌లు అందించారన్నారు. కార్యక్రమంలో సర్పంచు సాలమ్మ,వైస్ సర్పంచు శ్రీనివాసులు, సీఆర్‌పి రమణప్ప, యాదవ సంఘ నాయకులు మజ్జిగ గోపాల్‌యాదవ్, కేశవయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రిని సర్పంచు సాలమ్మ అందజేశారు.

హార్సిలీహిల్స్‌పై ఎస్సీ కమిషన్ చైర్మన్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ విడిది చేశారు. శనివారం రాత్రి కొండకు చేరుకుని బస చేసిన ఆయనకు ఆదివారం ఆయనకు పలువురు ఉన్నతాధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి సత్కరించారు.

షాదీ సమయంలో 'రక్త దానం'



రక్తదానం చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్‌సిద్దిక్

పెద్దమండ్యం: ఆపదలో ఎవరు ఉన్నా రక్తం కావాలంటే పిలవగానే పలికే వ్యక్తి హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ షాదీ సమయంలోనూ రక్త దానం చేశారు. మండలంలోని కలిచెర్లకు చెందిన అబూబకర్ సిద్దిక్ మదనపల్లెలో హెల్పింగ్‌మైండ్స్‌ను స్థాపించి ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేస్తూ పేరు గడించారు. కలిచెర్ల ఎవిఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అతని నిఖా చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అయితే షాదీ సమయంలోనూ రక్తదానం చేయాలని నిర్ణయించుకుని సహచరులకు చెప్పాడు. ఫంక్షన్ హాల్ వద్ద రక్త దానం చేసే ఏర్పాట్లు చేసుకొన్నారు. అతడితో పాటు 52 మంది ద్వారా రక్తదానం చేయించాడు. షాదీ సమయాన రక్తదానం చేసిన అబూబకర్ సిద్దిక్‌ను పలువురు అభినందించారు.

ధరలు తగ్గేదాక సబ్సిడీతో టమాట

రాయచోటి టౌన్ : టమాటల ధరలు అదుపులోకి వచ్చే వరకు సబ్సిడీతో ప్రజలకు అందిస్తామని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రైతు బజార్‌లో నాణ్యమైన టమాటలను సబ్సిడీతో (కిలో రూ.50లకు) అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలు ఇబ్బంది పడకూడదనే భావనతో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన టమాటలను అందించాలని సూచించారన్నారు. ఆయన సూచనలకు మేరకు టమాటల ధరలు అదుపులోకి వచ్చే వరకు రైతు బజారులో ప్రతి రోజూ ఉదయం 6:30గంటల నుంచి ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చిన వారికి కిలో రూ.50లకు అందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యుడు దిన్నిపాడు రవిరాజు మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● ముగిసిన మహాభారత యజ్ఞం



దుర్యోధన వధ ఘట్టంలో వేషధారులు

కేవీపల్లె మండలంలోని గర్నిమిట్టలో రెండు వారాలుగా నిర్వహించిన మహాభారత యజ్ఞం ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. మహాభారత యజ్ఞం వద్ద మట్టితో దుర్యోధన ప్రతిమ ఏర్పాటు చేశారు. అక్కడ దుర్యోధన, భీముని వేషధారులు చేసిన యుద్ధ ఘట్టం నాటకం రక్తి కట్టించింది. దుర్యోధుని వధ అనంతరం ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. దుర్యోధన వధ అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం, అనంతరం రాత్రి ద్రౌపది అగ్నిప్రవేశం నిర్వహించారు.

- కేవీపల్లె

● వరాల తల్లీ.. దీవించమ్మా



గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నైవేద్యం సమర్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

- గుర్రంకొండ